www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 14 డిసెంబర్ 2023

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



15న విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని ద్రాక్షారామ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఈ నెల 15న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు 17 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.విజయానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల వలన మండలంలోని ద్రాక్షారామ, తోటపేట, అన్నయ్యపేట, వేగాయమ్మపేట, వెంకటాయపాలెం, వెలంపాలెం, నెలపర్తిపాడు, జగన్నాయకులపాలెం, తాళ్ల పొలం, వెల్ల, సావరం, వేలపల్లి, కందులపాలెం, హసన్‌బాద, ఉండూరు, కావవరం, తాడిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ముందుకు సాగని 'నాడు-నేడు'

- పలు చోట్ల పూర్తికాని నిర్మాణాలు
- నిర్మాణాల కిందే చదువులు

ప్రజాశక్తి -మామిడికుదురు(పి.గన్నవరం)

కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు దీటుగా సర్కార్ బడులు రూపు రేఖలు మారిపోతున్నాయని వివిధ సందర్భాల్లో అటు సిఎం నుంచి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్న మాటలివి. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. చదువుకుందామంటే ఇరుకు గదులు.. ఆడుకుందామంటే ఆట స్థలంలో నాడు - నేడు పనులకు సంబంధించిన సామగ్రి, మరికొన్ని పాఠశాలలో అసలు ప్రాంగణాలే లేవు. నాడు- నేడు పనుల్లో పాత భవనాలు కూల్చారు. కొత్త భవనాలు పనులు సాగవు.. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా



పి.గన్నవరం మండలం గంటి పెదపూడిలో నిర్మాణాలు కిందే తరగతులు



పి.గన్నవరం మండలం లంకల గన్నవరం హైస్కూల్ భవనం

మొదటి విడతలోనే పూర్తికాని పనులు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నాడు-నేడు మొదటి విడతగా 805 తరగతి గదులు నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. వాటిలో 340 గదుల నిధుల లభ్యత తక్కువతో కోత పెట్టారు. 465 గదులు నిర్మాణంలో ఉన్నాయి. అనుమతులు వచ్చి మొదలుపెట్టినా కొన్ని చోట్ల శ్లాబ్ దశలో నిలిచిపోగా.. మరికొన్ని మొండి గోడలతో భవనాలు దర్శనమిస్తున్నాయి.



పునాదుల్లో పి.గన్నవరంమండలంమానేపల్లి బాలుర హైస్కూల్ తరగతి గదులు

ముందుకు సాగని నిర్మాణాలు

పనులు పూర్తి కావాలంటే నిధులు కావాలి నిధులు విడుదల చేయకపోవడంతో రెండో విడత నాడు- నేడు పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఒక పాఠశాలలో ఖర్చు కాకుండా ఉన్న నిధులు మరో పాఠశాలలు లేదా అంగన్‌వాడీ కేంద్రానికి మళ్లిస్తున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 772 పాఠశాలలు నాడు-నేడు పనులకు ఎంపిక చేయగా రూ.257 కోట్ల నిధులు మంజూరైనాయి. వాటిలో రూ.80కోట్లు విడుదలయ్యాయి. అయితే ఈ నిధులతో అక్కడ పనులైనా పూర్తయ్యాయంటే అదీలేదు. నిర్మాణ అస్తవ్యస్తంగా తయారయింది. పాఠశాలలకు సరఫరా అయిన సిమెంట్ బస్తాలు పనులు జరగని చోట గడ్డలు కట్టేసి పనికిరాకుండా పోయిన సందర్భాలున్నాయి.

అసంపూర్తి నిర్మాణం పనులు.. నిర్మాణం కిందే పాఠశాలలు

పి.గన్నవరం మండలం గంటి పెదపూడి జిల్లాపరిషత్ హైస్కూల్ నిర్మాణం అసంతృప్తిగా నిలిచిపోయింది. ఇక్కడ పాత భవనాలు నాలుగు గదులు ఉండగా ఒక గదిలో సిమెంట్, మిగిలిన గదుల్లో అరుగు మీద, నిర్మాణాలు కింద పాఠశాలలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా మానేపల్లి బాలుర హైస్కూల్ పరిస్థితి కూడా అలాగే ఉంది. ఇచట కూడా ఫౌండేషన్ నిర్మాణం, ఫౌండేషన్ సగం మేర గదులు నిర్మాణంలో నిలిచిపోగా మిగతా గదులు శ్లాబ్ దశలో పనులు నిలిచిపోయాయి. పి.గన్నవరం మండలం లంకల గన్నవరం హైస్కూల్ పనులు శ్లాబ్ దశలో నిలిచిపోయాయి. ముంగండపాలెం ఎంపిపి ప్రాథమిక పాఠశాల శిథిల భవనం పూర్తిగా తొలగించారు. అక్కడ నిర్మాణం పూర్తి కాకపోవడంతో పెంకుటింట్లో పాఠశాల నిర్వహిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం అవుతాయంటే పూర్తవుతాయంటే నిరలేదు.

ప్రభుత్వ పాఠశాలల భవనాలు పూర్తిచేయాలి



ప్రభుత్వం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశాలు నిర్వహించాం. నాడు-నేడు పథకంలో భాగంగా అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసి వాటిని వినియోగం లోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాం.

-సిహెచ్.వీరభద్రానందం, ఎంఇఓ-2, పి.గన్నవరం మండలం

పంట నష్టం నమోదు వేగవంతం చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు పంట నష్ట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వి బోసు బాబు సూచించారు. మండలంలోని సిహెచ్ గున్నే పల్లి గ్రామంలో గ్రామ కమిటీల అధ్వర్యం లో జరుగుతున్న పంట నష్టం నమోదు ప్రక్రియను బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేస్తూ, నష్టపోయిన రైతులందరి పంటలను పరిశీలించిన ఉదార స్వభావంతో నమోదు చేసి, రైతులకు నష్టపరిహారం అందించేలా బందాలు నమోదు ప్రక్రియను గడువు తేదీ డిసెంబర్ 18 లోపల పూర్తి చేసే విధంగా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటికీ నీట మునిగి ఉన్న పంట చేను ను పరిశీలించి సంబంధిత రైతును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ముమ్మిడివరం సహాయ వ్యవసాయ సంచాలకులు రామారావు, వ్యవసాయ అధికారి



నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

ఎస్.ప్రశాంత్ కుమార్ మరియు విఎఎలు మరియు విఎఎస్ లు తదితరులు పాల్గొన్నారు. అలాగే రంగు మారి మొలకెత్తి పాడైన వరి ధాన్యాన్ని ఆనాతవరం గ్రామంలో ఏరువాక శాస్త్రవేత్తల బందం పరిశీలించింది. ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.గౌరి రైతులకు పలు జాగ్రత్తలు సూచించారు. రంగుమారి మొలకెత్తి పాడైన ధాన్యాన్ని 5 శాతం ఉప్పు ద్రావణం చల్లడం ద్వారా నష్ట తీవ్రతను తగ్గించవచ్చునని, నష్టపోయిన రైతులంతా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించడం ద్వారా పంటను కాపాడుకోవచ్చు నన్నారు. ఈ బందంలో డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డా.బి.భవాని మరియు వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-అమలాపురం

గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినీటి కార్యదర్శులు తూనికలు కొలతలు తనిఖీలు నిర్వహణ ద్వారా వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని అమలాపురం డివిజన్ డిఎల్‌డిఒ పి.విజయ థామస్ బుధవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు తూనికలు కొలతలు శాఖ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సంయుక్తంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వార్డ్ ఎమినిటీ లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ పరిపాలన వికేంద్రీకరణ కొరకు క్షేత్రస్థాయిలో తూనికలు కొలతలు పరిశ్రమల శాఖలకు తగిన సిబ్బంది లేని నేపథ్యంలో గ్రామ వార్డు సచి వాలయాల సిబ్బంది ద్వారా తూనికలు కొలతలు తనిఖీ, చిన్న తరహా కుటీర పరిశ్రమల ఏర్పా టుకై ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రోత్సాహక చర్యలపై అవగాహన కల్పించామన్నారు. గ్రామ వార్డు స్థాయిలో ముందుగా వినియోగదారులకు అవగాహన సమావేశాల నిర్వహణతో పాటుగా డిజిటల్ మెకానిజం తో విస్తతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారన్నారు. రిజిస్టర్ కాబడిన వ్యాపార సంస్థలలో తూనికలు కొలతలు అమ్మకాలు నిర్దేశిత కనీస మద్దతు ధరలకు అమ్ముతున్నది లేనిది వీరు పర్యవేక్షించాలని ప్రభుత్వం విధివిధానాలను రూపొందించిం దన్నారు. క్షేత్రస్థాయిలో వినియోగదారుల హక్కుల పరిరక్షణలో భాగంగా దుకాణాల్లో తూనికలు, కొలతలు, మిషన్ల తనిఖీలు చేపట్టాలన్నారు. అలాగే మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వస్తువుల ఎంఆర్‌పి ధరలను దుకాణ దారు అమ్ముతున్న ధరలను తనిఖీ చేయాలని గ్రామ వార్డు సచి వాలయం ఉద్యోగు లకు సూచించారు. కార్యక్రమంలో తూనికలు కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేష్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పికెపి.ప్రసాదులుఅవగాహన పెంపొందించారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా వైద్యాధికారి ఎం.దుర్గారావు దొర అన్నారు.

మండలంలోని ఆనాతవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ సెంటర్ ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ డెలివరీలకు అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఆరోగ్య కార్యర్తలు, ఎంఎల్ హెచ్‌పిలు తమ పని తీరును మెరుగు పరుచుకుని రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట కేంద్రం వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆనాతవరంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి



పరిశీలిస్తున్న అగ్రిబోర్డ్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలో దంగేరు ఆర్‌బికెలో ధాన్యం కొనుగోలు ప్రక్రి యను రాష్ట్ర అగ్రి మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి పరిశీలించారు. పలు అంశాలపై ఆయన వివరాలు ఆర్‌బికె సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. తొలకరి పంట ఇప్పటి వరకు గ్రామంలో ఎంత మేర కొను గోలు చేశారని, మండలంలో ఎంత మంది దగ్గర ధాన్యం కొనుగోలు చేశారో రిపోర్ట్స్, రైతులు ఖాతాల్లో సొమ్ములు ఎన్ని రోజుల్లో జమ అవుతున్నాయి అని తెలుసుకున్నారు. తుపాను వలన జరిగిన నష్టం, ధాన్యంలో తేమ శాతం కొరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు పడుతు న్నా రనీ వ్యవసాయ శాఖ సిబ్బంది అడిగి తెలుసు కున్నారు. తేమ శాతం విషయంలో ధాన్యం కొనుగోలు సిబ్బంది ఆచరించ వలసిన విధా నాలు, తీసుకోవాల్సినజాగ్రత్తలు కొను గోలు సిబ్బందికి వివరించారు. రైతులకు ఇంకా ఏ విధమైన సేవలు అందించాలన్న విషయంలో ప్రత్యే కంగా ఫీల్డ్‌లో స్వయంగా పర్యటిస్తున్నట్టు ఆయన తెలియజేశారు. ఆర్‌బికెలో ఇస్తున్న సేవలకు ఆయన రిజిష్టర్‌లో సంతకం చేశారు. కార్య క్రమంలో వైఎస్ఆర్ హార్టీ కల్చర్ సభ్యులు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఆయనతో పాటు ఉన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ కులు శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



సంస్కరణాలయాలకి తమరు ఎన్నిసార్లు వెళ్లొచ్చారు సార్..!

అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

ప్రజాశక్తి-యంత్రాంగం

తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెను ఉధృతం చేశారు. సమ్మె బుధవారం రెండోరోజుకు చేరుకుంది.

అమలాపురం అంగన్‌వాడీలు రెండో రోజు సమ్మెలో భాగంగా సమ్మెలో పాల్గొని మద్దతిస్తూ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడంలేదన్నారు. . సుప్రీంకోర్టు చెప్పిన విధంగా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ తెలంగాణా కంటే రూ.1000 ఎక్కువ వేతనం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి హామీ నెరవేరలేదన్నారు. సమ్మె విరమించకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం ప్రభుత్వానికి తగదని ఆయన హెచ్చరించారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రయత్నం చేయాలని లేదంటే సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు కె.బేబీగంగారత్నం, ఎం.విజయ, జిల్లా ట్రెజరర్ పి.అమూల్య, ప్రాజెక్ట్ నాయకులు రత్నకుమారి, రుక్మిణి, విజయ, జి దైవకప, సీత, సుబ్బలక్ష్మి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ప్రధాన డిమాండ్లు

అంగన్వాడీలకు తెలంగాణా కన్న అదనంగా వేతనాలు పెంచాలి, గ్రాడ్యూటీని అమలు చేయాలి. మినీ సెంటర్లన్నీ తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చాలి, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచాలి. హెల్పర్ల ప్రమోషన్లో నిబంధనలు రూపొందించాలి. సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్‌వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలి. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలి. పెండింగ్లో ఉన బకాయిలు వెంటనే ఇవ్వాలి. నాణ్య మైన సరుకులు ఇవ్వాలి. ఒక యాప్ ద్వారా విధులు నిర్వహించే విధంగా చేయాలి.

మండపేట తమ డిమాండ్ల సాధన లక్ష్యంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె బుధవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు జనసేన నాయకులు వేగుళ్ళ వీరజ్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.గోపాలకష్ణారెడ్డి, టౌన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రారెడ్డి, ఎం. శ్రీనివాస్, ఆడిటర్ బి.నారాయణరావు, ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు దూలి జయరాజు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండపేట ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.బేబీ, ఆదిలక్ష్మి, సిహెచ్.రాణి, మంగాదేవి, జానకి, అనంత, దేవకి, దుర్గా, వజ్రం, కుమారి, నాగలక్ష్మి, కమల, సత్యవేణి, పద్మ, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** అంగన్‌వాడి కార్యకర్తల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ముమ్మిడివరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ దాట్ల సుబ్బరాజు డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద జయలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్ వాడీలు కళ్లకు నల్ల రిబ్బన్ లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వీరికి టిడిపి, కాంగ్రెస్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మరియు సిపిఎంనాయకులు మద్దతు తెలిపారు. సిపిఎం నాయకుడు సఖిలే సూర్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, విత్తనాల రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పాము బాలయ్య, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు దుర్గా మహేశ్వరి విజయ, జి.మంగాయమ్మ, కనకదుర్గ, సుబ్బలక్ష్మి, హైమావతి, టి. శ్రీదేవి, తలుపులమ్మ లతో పాటు 500 మంది అంగన్ వాడి కార్యకర్తలు మరియు సహాయకులు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** అంగన్వాడీ వర్కర్లు కు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, బుదవారం మోకాళ్ళ పై నిలబడి నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి నూకల బలరాం, అంగనవాడి జిల్లా కార్యదర్శి ఎం.దుర్గ, వి. వీరలక్ష్మి ప్రారంభించారు. రామచంద్రపురం, గంగవరం మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు. టిడిపి నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ మద్దతు తెలిపారు. సమ్మెలో అంగన్‌వాడీ జిల్లా సభ్యులు వాసంశెట్టి సూర్యకుమారి, మండల అధ్యక్షులు కే.విజయలక్ష్మి, జి.శ్రీదేవి, జహీరా, దుర్గ,తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** డిమాండ్ల సాధన లక్ష్యం గా మామిడికుదురు మండల కార్యాలయం ఎదురు గా అంగన్ వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె కు ఆశా వర్కర్స్, అంబేద్కర్ యువజన సంఘం, మండల జనసేన, టిడిపి శ్రేణులు, యుటిఎఫ్.నాయకులు, ప్రజా సంఘలు మద్దతు తెలిపారు.



మండపేటలో మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె



అమలాపురంలో మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరరావు



రామచంద్రపురంలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ముమ్మిడివరంలో అంగన్‌వాడీలకు మద్దతు తెలిపిన దాట్ల సుబ్బరాజు



మామిడికుదురులో అంగన్‌వాడీలకు మద్దతుతెలుపుతున్న యుటిఎఫ్



విద్యార్థి అఖిల్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

బాక్సింగ్ పోటీలకు 'దీప్తి' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-మామిడికుదురు

ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 25న జరగబోయే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థి చిట్టూరి అఖిల్ కుమార్ ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ డివివి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఇటీవల నర్సాపురం జిల్లా పెనుగొండలో జరిగిన అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల బాక్సింగ్ పోటీల్లో అఖిల్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని కళాశాల్లో ప్రిన్సిపల్‌తో పాటుగా పలువురు అధ్యాపకులు మోకా రంగారావు, పొన్నమండ సుబ్బారావు, గాదరాడ రవిచంద్ర, ముత్యాల నాగమౌళి తదితరులు అభినందించారు.

టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-అంబాజీపేట

టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో తొండవరం, నందంపూడి గ్రామాల్లో బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ హామీ పత్రాలు అందజేశారు. కె.పెదపూడిలో క్లస్టర్ కన్వీనర్ పి.శివసత్య హరిబాబు ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జి డివివి.సత్యనారాయణ, ఎస్‌సి సెల్ నాయకులు పెదపూడి శ్రీనివాస్ లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని భవిష్యత్తు గ్యారంటీ పత్రాలు అందించి అవగాహన కల్పించారు. టివి.హనుమంతరావు, సిహెచ్.పల్లం రాజు, ఎంపిటిసి సభ్యురాలు ఉషా భార్గవి, అర్జునరావు, నారాయణరావు, పితాని ఈశ్వరరావు, పాల్గొన్నారు. **మండపేట** స్థానిక 12,13 వార్డులలో ' బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అదుపు తప్పిన ఆంధ్ర రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టే సత్తా ఒక్క టిడిపి అధినేత చంద్రబాబుకే ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అంబాజీపేట మండలం నందంపూడి లో జరిగిన కార్యక్రమంలో టిడిపి శ్రేణులు

పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

నెల్లూరులో ఈనెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించే పిడిఎస్ యు 23 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు. బి సిద్దు పిలుపునిచ్చారు. ద్రాక్షారామలో మహా సభ గోడపత్రిక బుధవారం ఆవిష్కరించారు.

ఆయన మాట్లాడుతూ ఈనెల 15 మధ్యాహ్నం నెల్లూరులో విద్యార్థులు ప్రదర్శన నిర్వహిస్తామని అన్నారు. అనంతరం డాక్టర్ చాగంటి భాస్కరరావు ప్రాంగణం టౌన్ హాల్లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు అందరూ పిడిఎస్ యు రాష్ట్రస్థాయి సభలకు నెల్లూరు తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.కిరణ్ కుమార్, కె.అనిల్ కుమార్, కె.అర్జున్, డి.కొండబాబు, సాయి, అలీషా, శివ మణి, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అధ్యాపక బృందం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-మండపేట

జీవకోటి మనుగడి కోసం పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పలువురు అధ్యాపకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి డాక్టర్ నెహ్రు నాయక్ పరివేక్షణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు కాలేజీ ఆవరణలో సుమారుగా 200 కొబ్బరి చెట్లు నాటారు. కళాశాల విరామ సమయంలో కాలేజీ రేడియోలో పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను తెలియజేసే వివిధ అంశాలను ప్రచారం చేయాలని పలువురు అధ్యాపకులు సూచించారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని గంటావారిగూడెంలో 16వ నెంబరు జాతీయ రహదారిలోని వంతెన వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారిపై మతిస్థిమితం లేని వ్యక్తి నడిచి వెళుతూ ఉండగా విజయవాడ వెళుతున్న లారీ ఢీకొట్టి, అదుపుతప్పి జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో పాదచారి అక్కడికక్కడే మృతి చెందగా లారీ డ్రైవర్, క్లీనర్లకు గాయాలు అయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని నల్లజర్ల పోలీసులు తెలిపారు.

పేకాడుతున్న 15 మంది అరెస్టు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ఖండవల్లి గ్రామ పరిధిలో పేకాడుతున్న 15 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. వారి నుంచి రూ.35,060 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఉండ్రాజవరానికి చెందిన పెద్ద కామేశ్వరరావు మంగళవారం ఒక బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచారు. నిందితునికి ఈనెల 27వరకూ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కె.రామారావు తెలిపారు. సంఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితునికి రిమాండ్ విధించేలా విధులు నిర్వర్తించిన ఎస్ఐను ఎస్పి అభినందించారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ముగ్గళ్లలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించగా సారాను విక్రయిస్తున్న గోరుమట్ల వీరాస్వామి అలియాస్ మల్లారం అనే వ్యక్తిని అరెస్టు చేశామని కోరుకొండ ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ తెలిపారు. అతని నుండి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఆరు లారీలు ధ్వంసం

ప్రజాశక్తి -గోపాలపురం

ఆరు లారీలు ఒక దానికొకటి ఢీకొన్న ఘటన గోపాలపురం శివారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోపాలపురం శివారు జాతీయ రహదారిపై కొయ్యలగూడెం వైపుగా వెళ్లే దారిలో వే బ్రిడ్జ్ వద్ద రెండు లారీలు ఒకదాని ఒకటి ఢీకొన్నాయి. ఇందులో ఒకలారీ అదుపుతప్పి లంకలోకి వెళ్లిపోయింది. అక్కడ నుంచి అదే రోడ్డులో 100 మీటర్ల పరిధిలో మరొక నాలుగు లారీలు ఒకదానిని ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీలు ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేశారు.

వరకట్నం కేసులో జైలు శిక్ష

ప్రజాశక్తి - సీతానగరం

వరకట్నం కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష పడింది. ఇనగంటివారిపేటకు చెందిన గరపాటి ప్రశాంతి, సత్యనారాయణ భార్యాభర్తలు. వరకట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని 2019లో ప్రశాంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీని మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం దోషిగా తేలడంతో సత్యనారాయణకు ఏడాదిపాటు జైలు శిక్ష విధిస్తూ 7వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి.బాబు తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాష్ట్రంలోని అందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాలనేదే సిఎం జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ అన్నారు. స్థానిక సచివాలయం 2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిన లబ్ధిని వివరించే ప్రదర్శన బోర్డును ప్రారంభించారు. అనంతరం చెరువుగట్టు సెంటర్లో వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చైర్మన్ కె.శివన్నారాయణ, జడ్పిటిసి సామ్యూల్ సాగర్, నాయకులు కె.నాగరాజు, కె.వెంకన్న, సిహెచ్.చలపతి, ఎన్. శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తపాలా ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగంగా రెండవ రోజు బుధవారం స్థానిక సబ్ పోస్టల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎఐజిడిఎస్‌యు సర్కిల్ ఉపాధ్యక్షులు పేపకాయల వీరాజు, ఎ సురేంద్రనాథ్ మాట్లాడుతూ డాక్ సేవకులకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, గ్రామాల్లో పని చేసే 8 గంటల పని విధానం అమలు చేయాలని,పెండింగ్‌లో ఉన్న మరో ఐదు డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండవ రోజు డాక్ సేవక్‌ల సమ్మెతో బుధవారం గ్రామాల్లో తపాలా సేవలన్నీ నిలిచిపోయాయి. ఈ ధర్నాలో గ్రామీణ డాక్ సేవకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కరప

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి పి.శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం పెదబ్రహ్మదేవం సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇఓపిఆర్‌డి ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా పెంకే శ్రీలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షుడు సిహెచ్.ఈశ్వరరావు సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న హాస్టల్ విద్యార్థులు

అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన మంత్రి వేణు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం స్థానిక మండల పరిధిలో సమనస జ్యోతిరావు పూలే బిసి సంక్షేమ గురుకుల వసతి గృహంలో మంగళవారం కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన 12 మంది 5,6 తరగతులకు చెందిన విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడుతోందని మంత్రి వేణుగోపాలకృష్ణ వెల్లడించారు. బుధవారం ఆయన స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న 12 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పరా మర్శించి వైద్యులతో విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు.

జరిగిన సంఘటనపై డిఎస్‌పి ఎం.అంబికా ప్రసాద్, ఆర్‌డిఒ జి.కేశవర్ధన రెడ్డి ద్వారా విచారించాల్సిందిగా ఆదేశించా మన్నారు. అదే విధంగా బయట నుండి ఎగ్, పప్పు వంటి తాజాగా లేని తినుబండారాలను వసతి గృహంలో అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటి అమ్మకాలు పై కూడా దృష్టిసారించి నివేదికల సమర్పిం చాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు బయట నుండి తెచ్చిన బిర్యాని తినడం వల్ల ఆహారం కలుషితమై అస్వస్థతకు గురయ్యారా అన్న కోణంలో కూడా దర్యాప్తును నిర్వహించాలని ఆదేశించామన్నారు. భవిష్యత్తు లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా వంటశాలలో సిసి కెమెరాలు అమర్చి తాజాగా మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండి వడ్డిస్తున్నది లేనిది గమనించాలని సూచించారు. గురుకుల వసతి గృహంలో 380 మంది విద్యార్థులు ఆశ్రయం పొంది విద్యను అభ్యసించుచున్నారని, తొలుత మంగళవారం ఆరుగురు విద్యార్థులు మాత్రమే అస్వస్థతకు లోను కాగా మరో ఆరుగురు మంగళవారం రాత్రి అస్వస్థతతో ఆసుపత్రిలో చేరడం జరిగిందన్నారు. బిసి గురుకులాల్లో తాజాగా వండిన పదార్థాలని మెనూ ప్రకారం విద్యార్థులకు అందించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. వసతి గృహాన్ని సందర్శించి వంట శాలను పరిశీలించి ఆహార పదార్థాలు తాజాగా వండి తయారు చేస్తుంది లేనిది ఆహార పదార్థాలను రుచి చూసి పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్ ని ఆయన పరిశీలించారు. అరటి పళ్ళు తాజాగా లేకపోవడం గమనించి వెంటనే వీటిని మార్చాలని ఆదేశించారు. వారానికి సరిపడ మాత్రమే కూరగాయలు కొనుగోలు చేసి వినియోగించాలని ఆదేశించారు. వసతి గృహ మరుగుదొడ్లు బాత్రూమ్‌ల నిర్వహణ తీరును పరిశీలించారు. మనబడి నాడు నేడు రెండో దశలో వసతులను మరింత మెరుగు పరచాలని ఆదేశించారు.

కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీ పల్లవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దంగేటి డోలమణి రుద్ర, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్రావు, వైద్య బృందం, వసతి గృహ సంక్షేమ అధికారి శామ్యూల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్ అమలాపురం ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న అమలాపురం మండలం సమనస గురుకుల పాఠశాల విద్యార్థులను బుధవారం రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి పరమట శ్యామ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల యొక్క ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సదుపాయం అందించాలని వైద్యులను కోరారు.


ఏరియా ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న మంత్రి వేణు


క్రీడాకారులకు కిట్లు అందిస్తున్న ఎంఎల్‌సి తోట

ప్రతిభావంతులను గుర్తించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి-మండపేట

మండపేట ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించేందుకే ఆడుదాం ఆంధ్రా లక్ష్యమని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో క్రీడాకారులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, గ్రంధి శ్రీనివాస్, మొండి భవాని, ఎఎంసి డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మావతి, మున్సిపల్ కమిషనర్ టి రామ్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

ఉప్పలగుప్తం పంచాయతీ (చీకట్లపాలెం) గుత్తులవారి పాలెంలో ఎంపీ చింతా అనురాధ సమకూర్చిన రూ.5 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక సర్పంచ్, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్,వైసిపి రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలయ్య, వైసిపి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల హనుమంత శ్రీనివాసరావు, నాయకులు మోటూరి సత్యం కాపు,చీకట్ల రెడ్డినాయుడు,నల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎవిఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఎవరైనా మరణిస్తే వారి భౌతిక కాయాన్ని భద్ర పరిచే బాడీ ఫ్రీజర్ ను అవసరమైన వారికి ఉచితంగా ఇచ్చే ఎవిఆర్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని రావులపాలెం సి ఆర్ పి డైరెక్టర్ కర్రీ సుబ్బారెడ్డి అన్నారు బుధవారం బాడీఫ్రీజర్ పోస్టర్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అల్లం వర ప్రసాద్, సెక్రెటరీ రొట్టె మని ప్రసాద్ పాల్గొన్నారు.

పి.గన్నవరం టిడిపి అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు

ప్రజాశక్తి -మామిడికుదురు

పి గన్నవరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థిత్వాన్ని కోరుతూ ఎపి రాష్ట్ర ఆహార కమిషన్ మాజీ సభ్యులు, న్యాయవాది నాగాబత్తుల శ్రీనివాసరావు దరఖాస్తు చేసినట్టు బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. మాజీ మంత్రి దివంగత మెట్ల సత్యనారాయణ రావు, మాజీ డిప్యూటీ సిఎం నిమ్మకాయల చిన రాజప్ప మార్గదర్శకులుగా జిల్లా పార్టీ న్యాయవిభాగం సభ్యులుగా, రాష్ట్ర పార్టీ న్యాయవిభాగం కార్యదర్శిగా, కోనసీమలో దళితసంఘాల మరియు ప్రజా సంఘలన్యాయా సలహాదారునిగా, టిడిపి న్యాయావిభాగం రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా, 2008లో రాష్ట పార్టీ ఉపన్యాసకులుగా, అమలాపురం అసెంబ్లీ ప్రచార సమన్వయ కర్త గా పలు బాధ్యత లు నిర్వహించనన్నారు.

విఆర్‌ఒపై దాడికి నిరసన

- దాడికి కారకులైన వారిపై చర్యలకు విఆర్‌ఒ సంఘాల డిమాండ్
- నల్లబ్యాడ్జీలతో నిరసన, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- నేడు కలెక్టర్, ఎస్‌పికి వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-యంత్రాగం

విధులు నిర్వహిస్తున్న విఆర్ఒపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని విఆర్‌ఒలు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాలో పలుచోట్ల నల్లబ్యాడ్జీలు ధరించి విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది నిరసన తెలిపారు.

అంబాజీపేట ముక్కామల్లో విధులు నిర్వహిస్తున్న విఆర్ఒ దంగేటి పార్థసారథిపై ముక్కామల సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి కుమారుడు బండారు మల్లికార్జున్ మంగళవారం దాడిచేశాడు. ఈ సంఘటనపై చర్యలు తీసుకోవాలంటూ విఆర్ఒ బుధవారం అంబాజీపేట పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ ఎ.చైతన్య కుమార్ కు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న పార్థసారథి సర్పంచ్ కుమారుడు మల్లికార్జున్ భార్యను ఓటరు నమోదు కోసం ఐడి ప్రూఫ్ అడిగారు. సర్పంచ్ ఇంటికి వచ్చి ఐడి ప్రూఫ్ అడుగుతావా అని అన్ని పార్థసారథిపై మల్లికార్జున్ దాడికి దిగారు. ఈ ఘటనకు సంబంధించి దాడికి పాల్పడిన సర్పంచ్ కుమారునిపై చర్యలు తీసుకోవాలంటూ సచివాలయ సిబ్బంది సంఘం మరియు విఆర్ఎల సంఘం తహశీల్దార్, ఎంపిడిఒలకు ఫిర్యాదు చేశారు. విఆర్ఒల సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆత్రేయపురం ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న విఆర్ఒపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బుధవారం మండల విఆర్ఒల అసోసియేషన్ నల్లబ్యాడ్జీలు ధరించి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లా కమిటీ పిలుపుమేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. రానున్న కాలంలో ఇటువంటి దుశ్చర్యలు ఎవరూ పాల్పడకుండా ఉండే విధంగా జిల్లా సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్, మరియు ఎస్‌పిని కలసి వినతిపత్రం అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

మండపేట విఆర్ఒ పై దాడిచేనవారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు బలుసు రామకష్ణ, మండల కార్యదర్శి గంటి ప్రభంజన రవి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా జిల్లా విఆర్ఒలు అందరూ పార్థసారథికి అండగా నిలవాలని కోరారు. బుధవారం విఆర్ ఒలు అందరూ జిల్లా కమిటీ పిలుపుమేరకు నల్ల బ్యాడ్జీలు ధరించామని గురువారం జిల్లా కలెక్టర్, ఎస్‌పిలను కలసి వినతిపత్రం అందజేస్తామన్నారు.

కపిలేశ్వరపురం జిల్లాలో అంబాజీపేట మండలం ముక్కామల గ్రామ విఆర్ఒ పార్థసారథి పై జరిగిన దాడిని ఖండిస్తూ మండలంలోని వీఆర్ఒ లు బుధవారం కపిలేశ్వరపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అల్లాడి మల్లేష్ , మండల అధ్యక్షులు కొమ్ముల స్వామి నాయుడు, మాట్లాడారు. జిల్లా కమిటీ పిలుపుమేరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైనట్లు తెలిపారు జిల్లా సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కు, ఎస్ పి లకు వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండలంలోని విఆర్ ఒలు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం అంబాజీపేట మండలం ముక్కామల సచివాలయం వద్ద విఆర్ఒ దంగేటి పార్థసారథి పై దౌర్జన్యం చేసిన సర్పంచ్ కుమారుడు బండారు మల్లిఖార్జున్ పై చర్యలు తీసుకోవాలంటూ వి ఆర్ ఒ ల సంఘం మండల అధ్యక్షుడు అహ్మద్ ఆలీషా(బాజీ) ఆధ్వర్యంలో విఆర్ఒ లు నిరసన వ్యక్తం చేశారు.బుధవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా చూడాలని భూ రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సుబ్రహ్మణ్యానికి డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో విఆర్ఒ లు నాగులపల్లి పల్లంరాజు,ఆవిడి రాము,నంద్యాల భాస్కర బాలాజీ, మహాదశ శ్రీ రామ్,కోటిపల్లి రమణ,నాగరాజు, శ్రీమన్నారాయణ,చంద్రశేఖర్, ఒరుగుల నాగకుమార్, సూర్యకుమారి,మమత తదితరులు ఉన్నారు.


అంబాజీపేట విఆర్ఒల సంఘం ఆధ్వర్యంలో నిరసన


ఆత్రేయపురం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఆర్ఒలు


కపిలేశ్వరపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఒల నిరసన

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

ఏలూరు రేంజ్ డిఐజి

ప్రజాశక్తి-మండపేట

మండపేట పోలీస్‌స్టేషను ఏలూరు రేంజి డిఐజి జివిజి.అశోక కుమార్ బుధవారం తనిఖీ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషనులో రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో సంచలనంగా మారిన వారణాశిలో ఉరివేసుకుని సామూహిక ఆత్మహత్యకు పాల్పడిన మండపేటకు చెందిన గుండవరపు కొండబాబు, అతని భార్య ఇద్దరు కుమారులకు సంబంధించిన కేసులో యుపి పోలీసుల విచారణకుకు తాము పూర్తిగా సహకరిస్తామన్నారు. సూసైడ్ నోట్లో మతికి కారణమైన వ్యక్తుల పేర్లు ప్రస్తావించిన విషయంపై ఆయన మాట్లాడుతూ విచారణలో అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. యుపి పోలీసులతో తాము మాట్లాడినట్లు జిల్లా ఎస్‌పి శ్రీధర్ తెలిపారు. రాష్ట్రంలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు. గత సంవత్సరం గంజాయి రవాణాకు పాల్పడిన వారిపై 216 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 20కిలోల గంజాయి సీజ్ చేశామన్నారు. ఈ సంవత్సరం 293 కేసులు నమోదు చేసి 500 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్దనుంచి 10450 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. 417 మందిమీద రౌడీషీటు తెరవగా మరో 16 మందిపై పీడీ యాక్టు పెట్టినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 157 వాహనాలు సీజ్ చేశామన్నారు. పోలీసు నెట్వర్కు విస్తరించి స్థానిక పోలీసుల సహకారంతో సాధ్యమయ్యిందన్నారు. దీంతోపాటు శాంతిభద్రతలపై దృష్టి సారించామన్నారు. 2034 మంది రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరగా ట్రయల్కు వచ్చి శిక్షపడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం పోలీస్‌స్టేషనులో రికార్డులు పరిశీలించి పెండిం కేసులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివీస్పీ ప్రసాద్, పట్టణ సిఐ అఖిల జామ, రూరల్ సిఐ శ్రీధంకుమార్ సిబ్బంది ఉన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న డిఐజి

సచివాలయాల ద్వారా మెరుగైన పాలన

ప్రజాశక్తి-మామిడికుదురు

గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు మెరుగైనపాలన అందిస్తోందని ఎంఎల్‌ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. బి.దొడ్డవరంలో రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు.ప్రజలకు చేరువలో సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సి హెచ్.శివ రామ సుబ్రహ్మణ్యం, జెడ్‌పిటిసి సభ్యుడు కె.అంజిబాబు, కటకంశెట్టి ఆదిత్య కుసుమ శ్రీధర్, కొమ్ముల రాము, తులా గోపాల కృష్ణ, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


బి. దొడ్డవరం సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ చిట్టిబాబు

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి-అంబాజీపేట

మాచవరం భవిత కేంద్రంలో బుధవారంప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఎంఇఒ-2 మోకా ప్రకాష్ అధ్యక్షతన జరిగింది. చదువు పట్ల ఆసక్తి చూపేలా తర్ఫీతు ఇస్తే ఏదో ఒక రంగంలో వికలాంగులు నైపుణ్యత కలిగి ఉంటారన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులను వారి తల్లిదండ్రులు భవిత కేంద్రానికి పంపేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. డిజిటల్ విద్యాబోధన అందించేలా ట్యాబ్ లు అందజేశారు. ఆటల పోటీలలో విజేతలకు మెడల్స్, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, టి.రామకుమారి, ఎన్.సన్‌సైన్, కె.వెంకటేశ్వరరావు, వి.చంద్రకుమారి, వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మామిడికుదురు మండల విద్యా వనరులకేంద్రం లో బుధవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను సమాజం లో అందరితో సమానంగా పోటీ పడేలా తీర్చి దిద్దాలన్నారు. జెడ్‌పిటిసి సభ్యుడు కె.అంజిబాబు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలను ఉపాధ్యాయులు, వారి తల్లి తండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శారీరక, మానసిక, అభివృద్ధికి కృషి చేయాలన్నారు .భవిత కేంద్రం ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ లక్ష్మీ నారాయణ కోరారు. జిల్లా సాయి పోటీలలో విజే తలుగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2. మోకా వెంకన్నబాబు, ఎంపిపి స్కూల్ హెచ్ఎం కొమ్ముల వీర రాఘవరావు, కె. సుశీల, ఎన్.హిమబిందు పాల్గొన్నారు.


అంబాజీపేటమండలం మాచవరంలో వికలాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా గీత

ప్రజాశక్తి-అమలాపురం


దేవరపల్లి గీత

ముఖ్యమంత్రి జగన్ ఆదే శాల మేరకు అమలాపురం పట్టణానికి చెందిన దేవరపల్లి గీతను వైసిపి రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది. దేవరపల్లి గీత పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ విజయానికి కృషి చేశారు. ఆమె గీత ఫౌండేషన్ ద్వారా విశేష సేవలు అందించారు. తనకు సహకరించిన కోనసీమ ప్రజాప్రతినిధులకు ప్రజలకు గీత కతజ్ఞతలు తెలిపారు పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈమె భర్త వీఎస్ దివాకర్ ఎపి రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ గా ఉన్నారు. కోనసీమ ప్రాంతంలో అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

వినియోగదారుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం అవసరమని విశాఖ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యులు రహిమున్నీషాబేగం అన్నారు. బుధవారం ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహనా కారయక్రమాన్ని నిర్వహించారు. ఆదిత్య డిగ్రీ, పీడీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ నాయుడు మాట్లాడారు. కొనుగోలు, అమ్మకాలు, వస్తు ఉత్పత్తి, వినిమయం వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. డిజిటల్ మార్కెటింగ్, ఆన్‌లైన్లఓ కొనుగోలు ప్రక్రియ ఎక్కువైన తరుణంలో కొనుగోలుదారుడు హక్కుల గురించి, పరిరక్షణ కోసం చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి తదితరులు అభినందించారు.

సమస్యలపై మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ ఉపాధ్యాయుల బుధవారం ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వమించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ కాకినాడ జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.సాయిరాం మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లోని అన్ని పోస్టులను అప్ గ్రేడ్ చేయాలన్నారు. పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌సి.మూర్తి మాట్లాడుతూ 2022 జూన్‌లో మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు మున్సిపల్ యాజమాన్యం నుంచి పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి వచ్చాయన్నారు. యుటిఎఫ్ పోరాటం వల్ల కేడర్ స్ట్రెన్త్ సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జయరాజు తదితరులు పాల్గొన్నారు.